# మంచికి మూల్యం?

మూడు రోజులుగా కాళ్ళరిగి పోయేలా తిరిగి తిరిగి, నీరసంవచ్చిన శేషగిరి, ఇక నడిచేఓపిక లేక ప్రక్కగావున్న పార్కులోకి దారి తీశాడు. జన సమ్మర్థంలేని జాగా చూచుకుని, కూర్చున్నాడు. నిన్న రాత్రిమంచి భోజనంకూడా లేకపోవటంతో, అతగాడికి మత్తులాటి నిద్రేదో ముంచుక వస్తున్నట్లు తోచింది. అలాగే సిమెంటు బెంచీమీద పడుకుని కళ్లు మూసు కున్నాడు. అంతలోనే త్రుళ్ళిపడ్డట్టు పాంట్ జేబులో చెయ్యిపెట్టి, తన చదువు సర్టిఫికేట్ తీసి చూచు కొన్నాడు .... "ఎం. శేషగిరిరావు .... ఎం. ఎస్‌సి. ఫస్ట్‌క్లాస్!" పది మార్లు చదువుకున్నాడు. చదివినకొద్దీ ఏదో మంటరేగుతోంది గుండెల్లో! అగ్రికల్చరల్ ఎం. ఎస్‌సి. ఫస్టు క్లాసులో పాసైన తనకీనాడు ఎదురైన పరిస్థితేమిటి? ఎక్కడా ఉద్యోగం దొరక్క, ఇలా పస్తులతో పార్కుల్లోనో, రోడ్ల వారగానో పడివుండడమా? తనకంటే రెండేళ్లు పెద్దవాడైన అన్న వెంకట్రావుమాత్రం ఏం బావు కుంటున్నాడు? ఇంజనీరింగ్ డిగ్రీ పుచ్చుక, తనలానే వీధులు కొలు స్తున్నాడు!

శేషగిరి మనస్సంతా చికాకై పోయింది. మగతలాటి ఆ స్థితిలోనే అమ్మ, నాన్న, చెల్లాయిలు, తమ్ముడు అంతా గుర్తుకు వస్తున్నారు. ఇంజ నీరింగ్ కోర్సు పూర్తయి, వెంకట్రావు పెద్ద ఇంజనీరయితే తమ కిక ఆర్థికంగా కష్టాలు వుండవనే విశ్వాసంతో, వున్నపొలం ముప్పాతికభాగం అమ్మి, అన్న చదువు పూర్తి చేయించారు. ఈ లోగా - దేశ నాయకు లందరికీ, హఠాత్తుగా మనది వ్యవసాయిక దేశమనీ, వ్యవసాయికంగా దేశం అభివృద్ధి సాధించినపుడే, సాంకేతిక అభివృద్ధి సాధ్యమనీ గుర్తుకు వచ్చింది.... దాంతో వ్యవసాయాభివృద్ధి కోసం ప్రణాళికలూ, బడ్జటు

కేటాయింపులతోబాటు, అగ్రికల్చరల్ బి. ఎస్సీ. కి ఎక్కడిలేని డిమాండూ వచ్చిపడింది.

తిన్నగా బి. ఎస్సీ, ఎమ్. యస్‌సి. పూర్తిచేస్తే తనూ పెద్ద ఆఫీసరైతే, ఇక దిగుల్లేదనే భావంతో, మిగిలిన భూమీ, గ్రామంలోవున్న ఇల్లూకూడా అమ్మేసి, తన చదువు పూర్తిచేయించారు.

కానీ అనుకునేది ఒకటైతే, జరిగేదెప్పుడూ వేరొకటిగానే వుంటుం దేమిటో! అన్నయ్య ఇంజనీరింగ్ డిగ్రీ చేతికి తీసుకున్న మరుక్షణమే దేశంలోని సగంమంది ఇంజనీర్లకు ఉద్వాసన జరిగింది. మరి కొంత మందికి భవిష్యత్తు అయోమయంగా తయారయింది.

అందాకా వేలకువేలు కట్నం దిమ్మరిస్తామంటూ వచ్చిన సంబం ధాలు, అసలు ఇంజనీరుకు పిల్ల నివ్వటమే తప్పు అన్నట్లు తప్పుకు పోయాయి....

గంటల తరబడి డిగ్రీ కాగితంకేసి చూచుకొంటూ వెంకట్రావు ఆక్రోశిస్తుంటే, అమ్మా నాన్నలు తమ ఖర్మనూ, వాడి శని జాతకాన్నీ నిందిస్తుంటే, పి. యు. సి. పాసైన చెల్లాయి కమలకు కట్నం పేచీల మూలంగా పెళ్ళి సంబంధాలు కుదరకపోవటంతో, అది బి. ఏ. లో చేరి, ఉద్యోగం చేసుక ఆ తర్వాతెప్పుడో పెళ్లాడతానంటూ పట్టుబట్టి ఏడుస్తున్న శుభ ముహూర్తంలో – తను ఎం.ఎస్‌సి. ఫస్టుక్లాసులో పాసయ్యాడన్న ఆనందం ఎవరికి కలిగింది! ఏం మిగిలింది?

కమల బాధ చూళ్ళేక తనే అమ్మనూ, నాన్ననూ ఒప్పించి ఎలాగో దాన్ని బి. ఏ. లో చేర్పించాడు. కాలేజికి యింటికి సుమారు ఐదుమైళ్ళ దూరం కావటంతో కమల హాస్టల్లో వుంది.

తనకేదైనా ఉద్యోగంవస్తుందనీ, దానితో కొంతవరకూ పరిస్థితులు చక్కబడతాయనీ, ఆశించారంతా! కానీ జరిగిందేమిటి?

ఆ మధ్య ఓ ఉద్యోగం చేశాడతను. . .శేషగిరికి గత స్మృతులు చుట్టుముట్టాయి. . .

శేషగిరి క్లాస్‌మేట్ హరగోపాల్ బంగారు పిచ్చుక. వాళ్ళ నాన్న జగన్నాథరావుగారు ఐదారు రైస్ మిల్స్, రెండో మూడో పుగాకు కంపెనీలూ నడుపుతున్నాడు. తలవని తలంపుగా కలుసుకొన్న హర గోపాల్, శేషగిరి పరిస్థితులు తెలుసుకొని బాధ పడ్డాడు.

"నువ్వు మరోలా అనుకోకపోతే. . .మా నాన్నగారికి చెప్పి, మా రైస్ మిల్లు ఒకదాన్లో ఓ గుమస్తాపోస్టు యిచ్చేలా చూస్తాను . . . అంతకు మించి నేనేం సాయం చేయగలను ?" అన్నాడు సానుభూతితో.

అదే మహాభాగ్యమనిపించింది శేషగిరికి. వెంటనే అంగీకరించాడు. జగన్నాథరావుని గురించి శేషగిరికి చాలా సదభిప్రాయం వుంది. ఆయన గారు లక్షలార్జించాడు. కానీ ఎందరో పేద విద్యార్థులకు చదువు చెప్పిస్తు న్నాడు. ఎన్నో సంస్థలకు విరాళాలు ఇస్తారు. . . సంపాదించటంతోపాటు ధర్మగుణం కూడా వుంది . . . సంతోషంగా ఇంటికి ఉత్తరం రాశేసాడు శేషగిరి.

పదిరోజులుపాటు స్టాకు లెక్కలు చూచుకోవడం, గోడౌన్ సర్దిం చటంవరకే సరిపోయింది.

మరో పదిరోజులు పోయాక రైస్‌మిల్ నాలుగు వేపులా పరకా యించి చూచిన శేషగిరికి తనకేదో క్రొత్తలోకంలో అడుగు పెట్టినట్ట య్యింది.

రాశిగాపోసి వున్న గోధుమరంగు, ఎరుపుకలిపి నట్లున్న బియ్యం గోనెల కెత్తిస్తున్నాడు రామరాజు. రామరాజు కూడా తనలానే మరో గుమాస్తా.

"ఇవెక్కడి బియ్యం రామరాజూ? మొన్ననే వచ్చిన స్టాకంతా తెల్లని...కొత్తబియ్యకందా?" అన్నాడు శేషగిరి ఆశ్చర్యంగా! నాలుగు బియ్యపుగింజలు చేతులో వేసుక చూస్తూ.

"ఇవా! ఇవి పాతబియ్యం... ఇప్పుడే స్టాకు వచ్చింది...?" అదోలా నవ్వుతూ అన్నాడు రామరాజు.

"ఇప్పుడా? ఉదయం నుంచీ నేనిక్కడేగా వున్నాను? లారీలు రాందే? నాకు తెలీయకుండా స్టాకెలా దిగుమతి అయ్యిందీ?" మరింతగా విస్తుపోయాడు శేషగిరి,

"రామరాజు జాలిగా చూశాడు శేషగిరివేపు..."శేషగిరీ! నువ్వెలా బ్రతుకుతావోగానీ... ఇలారా వివరంగా చెబుతాను..." కూలీలకు బియ్యం గోనెలలోకి ఎత్తమని పురమాయించి, ప్రక్కగదిలోకి దారి తీశాడు రామరాజు. అనుసరించాడు శేషగిరి. విశాలమైన ఆ గదిలో ఓ మూలగా గోధుమరంగూ, ఎరుపూ కలిపిన మన్నులాటి రంగుపదార్థమేదో కుప్పబోసివుంది. మరోమూలగా, పిసరంత ఏదో నూనెవేసి, బియ్యపు రాశి గుచ్చెత్తి, ఈరంగు కొస్త కొస్త చల్లి కలుపుతున్నారు నలుగురైదుగురు కూలీలు. దాంతో అందాకా తెల్లగా నిగనిగలాడుతున్న బియ్యం, గోధుమ రంగుకు తిరిగి పాత బియ్యంలా మారిపోతున్నాయి...

"అర్థమయిందా?" అన్నాడు రామరాజు నవ్వుతూ...

"కొత్త బియ్యాన్నే... ఇలా పాతబియ్యంలా..." శేషగిరి ప్రశ్న ఇంకా పూర్తిగాక ముందే రామరాజు యోగిలా నవ్వాడు. "...మారి పోతాయి శేషగిరీ! ధరకూడా పెరుగుతుంది. బస్తాకు సమారు ముప్పై నలభై రూపాయలవరకూ రేటు హెచ్చుతుంది. బాలింతలకోసం...

చూలింతల కోసం .... ఈ పాతబియ్యం...కేవలం .... పరోపకారార్థం.... మార్కెట్‌లోకి రవాణా చేయబడుతుంది. ఓ రూపాయి అదనంగా ఇచ్చి అయినా కొంటారు ప్రజ... ఏమంటావ్!"

శేషగిరికి కళ్ళు తిరిగినట్లైంది.... "ఇదంతా జగన్నాథరావుగారికీ, హరగోపాల్‌కూ తెలుసా" మెల్లిగా అడిగాడు.

రామరాజు విరగబడి నవ్వాడు. "భలేవాడివే! జగన్నాథరావుగారి ఆమోదముద్రా, డైరెక్షన్, సలహా, ఉపాయం లేనిది ఇక్కడ మనుషులు శ్వాసకూడా పీల్చరోయ్ వెర్రికుర్రాడా! హరగోపాల్ బాబుగారుకూడా వ్యాపారపు సులువు బలువులన్నీ నేర్చుకున్నాడు. చిన్నబాబుగారు నడుపుతున్న అగ్గిపుల్లల కుటీర పరిశ్రమ తిలకించలేదూ ఎప్పుడూ? దానికి గ్రాంటు కూడా తనే పుచ్చుకున్నాడాయన!''

శేషగిరి తల అడ్డంగా తిప్పాడు....రామరాజు నవ్వాడు.

"ఆ అగ్గిపెట్టెలో ఉండేది వుట్టి పుల్లలే. ఎర్రభాస్వరం మిశ్రమంలో కాసిన్ని పుల్లలు ముంచి – ఇలా ఎండబెట్టేస్తారు... ఒక్క పుల్లకు మందు అంటదు. కాసింత అంటిన పుల్లమండదు. చచ్చినట్లు మళ్ళీ మళ్ళీ కొంటారు అగ్గిపెట్టెలు .. జనం....కదూ?" శ్వాస పీల్చినంత తేలిగ్గా చెబుతున్న రామరాజు వేపు ఆశ్చర్యంగా చూశాడు శేషగిరి.

"అంత సరదాగా నవ్వుతావేమిటి రామరాజూ! ప్రజ...జనం అంటావు...వాళ్ళలో నువ్వూ నేనూ కూడా లేమూ?" శేషగిరి మాటలకు అడ్డొచ్చాడు రామరాజు.... "నీలో, నాలో వున్న భావవిప్లవం ప్రజలందరిలో లేదోయ్ శేషగిరి. అది వున్న నువ్వూ, నేనూ సాధించగలిగేదేమిటో చెప్పుచూద్దాం! పస్తులు .... నిరుద్యోగం ... మనమీద ఆశలు పెట్టుకున్న మనవాళ్ళ ఆశలమీద నీళ్లు దిమ్మరించటం .... కాదూ? పద

వెడదాం! ఈ పాతబియ్యం లారీలకెత్తించాలి మధ్యాహ్నం! "హడా వుడిగా బయటకు దారితీశాడు రామరాజు.

"ఆమూల ఆ చిన్ని రాళ్ళేమిటి?" కెవ్వుమంటూ అరిచాడు శేషగిరి గదిబయటకు రాబోతూ. . .

"భగవంతుడా! బ్రతుకుతెరువులోని ప్రాథమిక సూత్రాలే తెలీని నువ్వు ఎలా బ్రతుకుతావోగానీ, ఇక్కడ ఎక్కువ రోజులు వుండలేవు శేషగిరీ.... బియ్యం లాటి ఆ రాళ్ళు.... బియ్యంలో కలపటానికి పావు శేరుకు పదిపైసల చొప్పున ఇచ్చి ఏరిస్తాం."

"అలాటి వెధవ పనికి....కూలికి వచ్చేదెవరు" జుగుప్సగా అరిచాడు శేషగిరి.

"ఆడకూలీలు ...బీడీలు .. చుట్టలు ....అగ్గిపుల్లల తయారీలలానే ఇదికూడా పార్ట్‌టైం జాబ్‌లా సంతోషంగా చేస్తారు చాలామంది స్త్రీలు, ఈ చుట్టుపక్కల.... ఇంక ప్రశ్నలు వెయ్యక. . . కాస్సేపట్లో జగన్నాధ రావుగారు వస్తారేమో . . . స్టాక్ లారీలకెత్తేందుకు రెడీగా వుండాలి" రామరాజు వడిగా వెళ్ళిపోయాడు. అక్కడేవున్న బియ్యపు బస్తాలమీద కూర్చుండి పోయాడు శేషగిరి. . .

ఇదెంత దారుణం. . . తాము తినే అన్నంలో తామే రాళ్లు కలుపు కొనేంత నైచ్యానికి తలపడుతున్నారా! ఆ రాళ్ళు ఏరటం, పార్ట్‌టైం జాబ్‌లా — హాబీలా చేస్తున్నారా? ఆ కూలీడబ్బులతో, ఆరాళ్ళ బియ్యమే కొని. . .తామే ఆరాళ్ళు ఏరిపారేసుక. . .భగవాన్. . .ఏమిటి దారుణం. . . మనిషి ఎటు ప్రయాణం చేస్తున్నాడు?

జగన్నాధరావుగారు ఇంతటి నీచపు పనులు చేయిస్తారా? ఇలా సంపాదించిన డబ్బు. . .ఇన్ కమ్‌టాక్స్‌కు బదులుగా .... పేదవిద్యార్థుల

చదువులు....ఏవో సంస్థల విరాళాల రూపాలలో ఖర్చుచేస్తాడా! చివరకు తాను ఈనాడు జీతంగా తీసుకుంటున్న డబ్బుకూడా ఆ పాపపంకిలం తాలూకుదేనా? ఛీ....ఛీ.... ఇలాటి ఉద్యోగం చెయ్యటం...జగన్నాధ రావుగారి గురించిగల సదభిప్రాయం క్షణాలమీద ఎగిరిపోయింది.

"ఏమిటి శేషగిరీ! సినిమాలో పేద హీరో, ఖరీదైన బట్టల్లో, ఆవేశపూరితమైన ఎక్స్‌ప్రెషన్స్ చూపిస్తున్నట్లు పెట్టావు ముఖం...?"

హరగోపాల్ నవ్వుతూ భుజం చరచటంతో ఉలికిపడ్డాడు శేషగిరి ...ఈ వాతావరణం తనని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నట్లుంది, ఊపిరి సలపకుండా.

"....మీ నాన్నగారు రాలేదా?" తడారిపోతున్న పెదవులు, నాలుకతో తడిచేసుకుంటూ అడిగాడు శేషగిరి.

"ఊహూ! నన్ను పంపారు. పాతబియ్యపులారీ పంపినా, నీ సమాధిముద్ర చలించకపోవటంతో, కదిలించాను."

"గోపాల్! మరోలా అనుకోకపోతే ఓ మాట చెప్పనా?"

"చెప్పు!" స్నేహపూర్వకంగా నవ్వాడు హరగోపాల్.

"నేనీ ఉద్యోగం చెయ్యలేను. నేనీ అన్యాయాలు సహించలేను.... వాటిని ప్రోత్సహించలేను....ఓ స్నేహితునిగా చనువుతీసుకు చెబుతున్నాను...." శేషగిరి ఏదో తప్పుచేస్తున్నవాడిలా తలవంచుకున్నాడు.

క్షణకాలం అతగాడికేసి నిశితంగాచూచిన హరగోపాల్ చిరునవ్వు నవ్వాడు.... "నాకు తెలుసు....కానీ ఒక్కటి చెప్పనా శేషగిరీ? ఇక్కడే కాదు....ఈ దేశం అణువణువునా ఈనాడు ఇలాటి అన్యాయాలూ, ఇంతకు మించిన ఘోరాలూనిండివున్నాయి. వీటన్నిటికీ అతీతంగా నువ్వు బ్రతకగలవా? అసంభవమేమో! పోనీ నీలాటి లక్షలాది నిరుద్యోగులకు

మంచిగా, నీతిగా, నిజాయితీగా బ్రతకగలిగే ఉద్యోగాలు చూపగల సామర్థ్యం, మనదేశంలో ఇంకా వుందనే నువ్వు విశ్వసిస్తున్నావా ?"

శేషగిరి మాట్లాడలేదు.

"శేషగిరీ ! నేనూ, మా నాన్నగారూ చేస్తున్న దారుణాలు నీకు బాధ గలిగిస్తున్నాయి. నిజమే ! అవేవీ చేయలేకపోతే - మేమూ నీస్థితి లోనే వుండే వాళ్ళం ...ఏ అన్యాయం చేయలేని నీ బ్రతుకు ఎలావుందో చెప్పు. . .చివరకు మీ చెల్లాయికి చదువు చెప్పించడమో, పెళ్ళి చెయ్యడమో - చేసే స్థితిలో వున్నావా నువ్వు ?"

"........."

"నీ యిష్టం. ఎక్కడేనా నువ్వు సంతోషంగా బ్రతుకుతానంటే నాకు అభ్యంతరం లేదు. . .నీ డబ్బు లెక్కచూచి ఇచ్చేస్తాను సాయంత్రం. . ."

కాసేపాగి హరగోపాలు వెళ్ళిపోయాడు. . .

ఆ సాయంత్రం తనకురావలసిన డబ్బుతీసుకుని బయటపడ్డాడు. . . ఇంటికి జాబు వ్రాసేసాడు. . ,ఉద్యోగం వూడినట్లు. . .నాలుగు రోజుల్లో తండ్రి చీవాట్లు పెడ్తూ జవాబు వ్రాశాడు.

". . .నీ వుద్యోగం ఆసరాతో కొత్త ఆశలు నింపుకున్నాం. అదీ పోగొట్టావు. నీ 'మంచి' కి 'మూల్యం' గా మా అందరి బ్రతుకులూ చెల్లిస్తావా ? నీ చెల్లెలిని ఎగిరెగిరి కాలేజీలో చేర్పించావు. దానికి నెలా నెలా డబ్బెవరు, ఎలా పంపిస్తారు ? మీ ఇంజనీరు అన్నగారు వెర్రి వాడిలా తిరుగుతున్నాడు. . .చివరకు ఏదో ఇంజనీరింగు వర్క్‌షాపులో తొంభై రూపాయల జీతానికి ఒప్పుకుంటా నంటూ పట్టుబట్టాడు. వాడి

బ్రతుకలా తెల్లారింది! నీ నీతులతో మా మతులు పోగొట్టేలా వున్నావ్. . ."

ఆ జాబునిండా చీవాట్లే. . .అందుకే ఇంటికి తిరిగి వెళ్ళటానికి మన స్కరించలేదు. . . మళ్ళీ ఎక్కే ఆఫీసూ, దిగే ఆఫీసూ. . .

వ్యవసాయాభివృద్ధి అనటమేగానీ. . . తగినంతమంది ఆఫీసర్లను నియమించటమేదీ ?

రైతులకు తగిన ప్రోత్సాహమేదీ? ఆకాశవాణిద్వారా పంటలను గురించీ తెగుళ్ళను గురించీ బోధించటమే గానీ. . . అది ఎందరు వింటు న్నారు. మరెంతమంది గ్రహించగలుగు తున్నారు అన్న ఆలోచన ఎవరికుంది? అసలు రైతుకూ. . . ప్రభుత్వానికీ మధ్య సన్నిహిత సంబంధం ఏదీ!

....తనలాటి వారు వ్యవసాయాభివృద్ధి ఆఫీసర్లుగా పని చేస్తే.... అటు రైతుకక్కరవలసిన సౌకర్యాలనూ, ఇటు ప్రభుత్వం చేస్తున్న.... చేయదల్చుకున్న సాయాలనూ, సమన్వయ పరుస్తారు కదా? కానీ ఆ అవకాశం ఇచ్చేదెవరు!

*　*　*　*　*

"ప్లీజ్! మీరు కాస్త లేవండి ... ".

ఏలోకంనుంచో వినిపిస్తున్నట్లు కంఠస్వరంతో, కళ్ళు తెరచి చూడబోయాడు శేషగిరి తెరిపిడి పడలేదు....

"కొద్దిగా నోరు తెరవండి... మంచినీళ్లు తాగితే కాస్త తేరుకుంటా రేమో!" ఆ ధ్వని చాలా చాలా మృదువుగా వుంది.

మెల్లగా నోరు తెరచాడు....కొద్ది కొద్దిగా గొంతుకలోకి జారిన మంచినీళ్ళతోబాటు, కళ్లు పూర్తిగా తెరిపిడి పడ్డాయి. ఎదురుగా, తన

చుట్టూరా చాలామంది జనం పోగయి వున్నారు....బాగా పొద్దు పోయిందల్లే వుంది.... మెల్లిగా లేచి కూర్చున్నాడు.

"శేషగిరిరావుగారూ! చాలా నీరసంగా వున్నారు. నా వెంట రండి...." అన్నాడా ఆజానుబాహువ్యక్తి....

"మీరెవరు? నా పేరెలా తెలుసు?" కుతూహలంగా అడిగాడు శేషగిరి....

"నా పేరు డాక్టర్ మాధవరావు. . .మీరు స్పృహ తప్పిపోయినట్లు న్నారని జనం గగ్గోలు చేస్తుంటే ఇటుగా వచ్చిన నేను చూచాను....పల్స్ బాగానే వుంది....కొద్దిగా మైకం కమ్మినట్లుంది ..

....మీ పాంట్ జేబు చూశాను. మీ గురించిన వివరాలేమైనా తెలు స్తాయేమోనని మీ సర్టిఫికెట్ మీ రెవరో, మీడిగ్రీ ఏమిటో చెప్పింది ....పదండి వెడదాం .. ఏదేనా ఆహారం తీసుకుందురుగానీ .... డాక్టర్ కళ్ళల్లో "బహుశా నీకు రెండు రోజులుగా ఆహారం లేదని నాకు తెలుసు...." అన్న భావంతో బాటు మానవత్వపు నీడలు కదిలాడు తున్నాయి.... శేషగిరి మెల్లగా లేచాడు. చుట్టూరావున్న నలుగురైదుగురు ఏవో వ్యాఖ్యానాలు చేసుకుంటూ దోవ ఇచ్చారు.

హోటల్‌లో భోజనం పెట్టించాక....మాధవరావు మృదువుగా అడి గాడు "ఉద్యోగాన్వేషణలోనే వున్నారా?"

"ఊ!"

"మా బావమరది ఒకతను....ఎరువుల కంపెనీ పెట్టాడు....మీకిష్ట మైతే అతగాడితో మాట్లాడుతాను రసాయనిక పదార్థాలు .... వివరాలు తెలిసిన వారికోసం అన్వేషిస్తున్నాడతగాడు....ఏమంటారు?"

శేషగిరికి ఏం మాట్లాడాలో తెలియలేదు. ఆఖరురూపాయి ఖర్చు అయిపోయిన మరుక్షణంలో లక్షరూపాయలు లాటరీలో గెల్చినంత ఆనందం కలిగింది....

మూడురోజులు ఎలా గడిచాయో అతగాడికే తెలియలేదు... మాధవ రావు బావమరది రాఘవరావుగారి ఎరువుల కంపెనీలో ఉద్యోగంవచ్చింది. జీతం కూడా బాగా ఎక్కువే! కంపెనీ ఖర్చులమీదే, చుట్టుప్రక్కల టౌన్లకూ, సిటీలకూ కారులో వెళ్ళి ఎరువులకు విరివిగా ఆర్డర్స్ బుక్ చేసుకురావాలి....ఆ ఎరువులలోని రసాయనిక పదార్థాలను గురించి, ఏ యే పంటలకు, ఏ యే శాతంలో ఆయా పదార్థాలు వేస్తే, ఎలాటి సత్ఫలితాల నిస్తుందో ప్రచారం చేయాలి....

చాలా ఇష్టమయిన ఉద్యోగమే తనకు దొరికిందని మురిసిపోయాడు శేషగిరి. ఇక ఛస్తే ఈ ఉద్యోగం వదులుకో కూడదని నిర్ణయించు కున్నాడు. ఉద్యోగం స్థిరపడ్డాకే ఇంటికి వుత్తరం వ్రాయొచ్చు నను కున్నాడు.

ఆరోజు టూర్ వెళ్ళి చాలామంది రైతుల దగ్గర సరుకుకు ఆర్డర్స్ బుక్ చేసుక వచ్చాడు, మర్నాడు సరుకు డెలివరీ ఇవ్వాలి....రాఘవరావు గారు చాలా మెచ్చుకున్నారు....

శేషగిరి పొంగిపోయాడు. రైతుల మధ్యకువెళ్ళి తను ఆ ఎరువుల గురించీ-వాటి ప్రయోజనాల్ని గురించీ, ముఖ్యంగా రాఘవరావుగారి రసా యనిక ఎరువుల వల్ల కలిగే లాభాల గురించీ, అనర్గళంగా ఉపన్యాసం ఇస్తుంటే, వాళ్ళువాక్కై వింటూంటే...."మీవల్ల మావ్యాపారం నిజంగా వృద్ధి చెందుతుందనే నమ్మకం కుదిరిందండీ...." అని రాఘవరావుగారే అంటూంటే....అంతకు మించిన ఆనందం మరొకటి లేదనిపించింది శేషగిరికి. మూడు లారీల సరుకు డెలివరీఇచ్చేసి, లాడ్జికివచ్చి పడు

కున్నాడు శేషగిరి. అతగాడి అంతస్తే మారిపోయిందనిపించింది. ఫోన్ కాల్ వచ్చిందని లాడ్జీ ప్రొప్రైటర్ చెప్పగానే, ఫోన్ రిసీవ్ చేసుకొన్నాడు శేషగిరి. రాఘవరావుగారు ఫోనులో పిలిచారు. "అర్జంటుగా మీరు గుంటూరు వెళ్ళండి. కాల్షియం నైట్రేటు, అమోనియం క్లోరైడ్ బస్తాలతోపాటు.... మెత్తని తెల్లని సన్నని ఇసుక బస్తాలుకూడా లారీలో లోడ్ చేయించాను నిన్ననే.... లారీ జాగ్రత్తగా ఇక్కడికి చేరేలా తెలివిగా ప్రవర్తించండి. మీ మీద ఆపాటి నమ్మకం వుంది నాకు!"

అవతల ఫోన్ పెట్టేశారు రాఘవరావుగారు! ఇవతల ప్రమాన్పడి నిల్చుండి పోయాడు శేషగిరి....

మెత్తని, తెల్లని సన్న ఇసుక....ఎందుకు? రూంలోవచ్చి పడుకుని బుర్ర బద్దలు కొట్టుకొన్నా అర్థంకాలేదు.. హఠాత్తుగా గుర్తుకు వచ్చింది....అమోనియం సల్ఫేటు....అచ్చు సన్నని తెల్లని సముద్రపు ఇసుకలా వుంటుంది!....

బాబోయ్! రాఘవరావుగారు అలా కల్తీ చేయిస్తారా?

ఏం ఎందుకు చేయించగూడదు?

మొన్న వోరోజు కొన్ని బస్తాలు తిరగబోసి, తిరిగి బస్తాలలో మిషన్‌కుట్టు కుటిస్తూంటే, తను చూచి అడిగాడు....ఎందుకని....సమాధానంగా "లోపలి పోలిథిన్ కాగితాలు చిల్లు పడ్డాయి. . .తిరగపోస్తున్నాము మంచి గోనెలో! పాపం! రైతులిచ్చేది డబ్బు కదుటయ్యా! మంచి సరుకు సప్లై చేస్తే అటు వాళ్ళకూ లాభం, మనకూ తృప్తి. మన కంపెనీకి పేరు ప్రఖ్యాతులువస్తాయి....ఏమంటారు?" అన్నాడాయనగారు.

తను మహా ఆనందించాడు ఆయనగారి నిజాయితీకీ, సేవా పరాయణత్వానికీ! కానీనాడు!

పక్కరూంలో తనతోపాటువచ్చిన సహఉద్యోగి రామారావును.... అతగాడుకూడా ఎగ్రికల్చరల్ బి. యస్‌సి, పాసై, ఏ ఉద్యోగం దొరకక తనలానే ఈ రాఘవరావు కంపెనీలోనే వున్నాడుప్రస్తుతం....లేపి సందేహ నివృత్తి చేసుకుందామనిపించింది శేషగిరికి.... కాని అది మంచిపని కాదని మానేశాడు....రాత్రికిరాత్రే కారులో శేషగిరీ, రామారావు గుంటూరు వెళ్ళారు. మరునాడు సాయంత్రంవరకూ కమలను చూడటానికి తీరిందికాదు.... ఈలోగా ఇసుక బస్తాలున్న లారీవెంట వెళ్ళాల్సివచ్చింది. త్రోవలోరామారావే అన్నాడు....

"ఇక్కడ మీచెల్లాయి చదువుకుంటుందన్నారు. మరి చూచిరాలేదే మండీ?" అంటూ.

"ఈమారు వస్తానుగా? వారంరోజుల్లో చాలా సరకు డెలివరీ యివ్వాలి మనం. చాలా ఆర్డర్స్ బుక్ చేసాను. అప్పుడు స్థిమితంగా నాలుగురోజులుంటాను. చెల్లాయిని కలుసుకుంటాను...." అన్నాడు శేషగిరి. నిజానికి తన ఉద్యోగాన్ని గురించి, పెరిగిన అంతస్తు గురించీ తన ప్రయోజకత్వం గురించీ.... ప్రత్యక్షంగా కమలకు చూపించాలని వుంది శేషగిరికి....ఇందాకా ఆ అమ్మాయికి పైసా సాయం చేయలేక పోయాడుతను. ఓ వేపు చదువు మానుకొని రమ్మనీ, మూడో పెళ్ళివరుడు, ఐదుగురు పిల్లల తండ్రి ఒకాయన వివాహమాడటానికి సిద్ధంగావున్నట్లు నాన్నగారు వ్రాశారంటూ బాధపడుతూ ఆమధ్య ఒక ఉత్తరం వ్రాసింది కూడాను

తను వెళ్ళి ఏ దిగులూలేకుండా తను చదివించగలననీ, మంచి సంబంధం వెదకి పెళ్ళి చేయగలననీ, ధైర్యం చెప్పిరావాలని వుంది.

"....మీరు దయచేసి ఆ రైతులకు అంత నమ్మకంగా చెప్ప కండి.... రేపొద్దున మీ పీక పట్టుకుంటారు వాళ్ళు. లోగా నా కలాటి

అనుభవం ఒకటైంది.... అయితే వాళ్ళలో అంత చదువుకున్నవారూ, ఈ రసాయినిక ఎరువులలోని సూక్ష్మాలు బాగా తెలిసినవారూ లేకపోబట్టి మన రాఘవరావుగారి లాటివారు కొందరు ఇలాటి మోసాలు చేసి నెగ్గుకు వస్తున్నారనుకోండి...అన్నీ తెలిసిన మనం కూడా...అనర్గళంగా వుపన్య సించి ఆత్మవంచన ఎలాగూ చేసుకొంటున్నా మనుకోండి ... ఇంకా దిగ జారటమే అవుతుంది కదూ ?"

"మీ రంటున్నది నా కర్థంకాలేదు. సరిగా చెప్పండి ప్లీజ్ !" శేషగిరి లోపల రేగుతున్న ఆలోచనల్ని అదుపులో పెట్టుకుంటూ అన్నాడు.

రామారావు నవ్వాడు. "ఇందులో అర్థంకానిదేముందీ ? యూరియా ధర బస్తా 1కి షుమారు నలభై ఎనిమిది రూపాయలు వుంటుంది కదూ ? ఆమోనియం క్లోరైడ్ - చూడటానికి (ఉప్పు-కర్పూరంలా) యూరియా లానే వుంటుంది, అవునా ? కానీ దీని ధర బస్తా 1కి షుమారు ముప్పై రూపాయలే !

పోలథిన్ పేపర్లు చిల్లులు పడ్డాయనే సాకుతో, రాఘవరావుగారు, యూరియాబస్తాలు విడదీసి—కొంతశాతం, అమోనియం క్లోరైడ్‌కలిపి... తిరిగీ మిషన్ కుట్టించేస్తున్నారు.

అలాగే అమోనియం ఫాస్పేటులో, అలాగేవుండి, ధర తక్కువగా వుండే కాల్షియం నైట్రేటు కలిపేస్తున్నారు! అమోనియం సల్ఫేటు ఇసుకలా వుంటుంది కదూ ? దానిలో మిక్స్ చేయడానికే ఇసుకబస్తాలు ...."

శేషగిరి సీటుకు జేరగిలబడి బిగుసుకు పోయాడు. అలాటి కల్తీ సరుకు ... తను షుమారు పదిలారీలు డెలీవరీ యిచ్చేశాడు... ఆ సరుకు గురించి, అందులోని గొప్పతనాన్ని గురించీ - అమాయకులైన రైతులకు అనర్గళమైన ఉపన్యాసాలిచ్చాడు! పరోక్షంగా రాఘవరావుగారిలాటి మేక

పన్నెన్ని పులికి లాభం సంపాదించి పెడుతున్నాడు....ఎంత దారుణం! ఈ రోజు తిరిగి షుమారు మరో పది లారీల సరుకు ఆర్డర్స్ బుక్ చేయించుక వస్తున్నాడు!

"...ఏమిటి మీరలా కృంగిపోయారు? మనస్సు సర్దుకోండి... నేనూ మొదట్లో మీలానే బాధపడేవాణ్ని...ఒకమారు మనసు సర్దుకోలేక ఉద్యోగం వదులుకున్నాను కూడా! కానీ లాభమేమిటి? వస్తులతో నేనూ, నా ఇంట్లోవాళ్ళూ మాడిపోయామేగానీ, రాఘవరావుగారి వ్యాపారం నిరాటంకంగా మరొకళ్ళసాయంతో సాగిపోతోనేవుంది! ఎక్కడికి వెళ్ళినా... ఏదో ఓ రకం ఆత్మవంచన చేసుకోక తప్పదు, శేషగిరిరావుగారూ! అందుకే తిరిగీ ఇక్కడికి వచ్చాను. . .మీరూ మనసు సర్దుకోండి – అయితే మన రాఘవరావుగారి సరుకును గురించి భారీగా పొగడకండి. పాము చావకుండా, కఱ్ఱ విరగకుండా వుండేపద్ధతి చూచుకోవటం శ్రేయస్కరం... ఏమంటారు?"

శేషగిరికి బుఱ్ఱ తిరిగి పోతోంది! హరగోపాల్ హెచ్చరిక గుర్తుకు వచ్చింది... అంతేనా? సిమెంటులో బూడిద, పాలల్లో నీళ్ళు, పప్పులో రాళ్ళు... బియ్యంలో రాళ్లూ, రంగూ, చక్కెరలో రవ్వ, ఎరువుల్లో ఇసుకా – తక్కువ రకం ఎరువూ... మనుషుల్లో స్వార్థం చిరునవ్వూ... మానవత్వంలో ఆత్మవంచన... భగవాన్! దీనికి అంతంలేదా! మనిషి జీవితం, రక్తం, శ్వాస అన్నీ కల్తీ సరుకుగా మారిపోతున్నాయా!

"రామారావ్! మీరు లారీవెంట వెళ్ళండి... నేను గుంటూరుకు వెళతాను... అట్టే దూరం రాలేదుగా మనం...! ఇక్కడ దిగి ఏదేనా బస్సులో వెడతాలెండి... తర్వాత వచ్చి కలుసుకుంటాను రాఘవరావు

గారిని...ప్లీజ్ " ముఖమంతా పట్టిన చెమట తుడుచుకుంటూ, ఓ విధమైన విరక్తితో నిండిన ధ్వనితో అన్నాడు శేషగిరి.

రామారావు సానుభూతి నిండిన కళ్ళతో శేషగిరివేపు చూశాడు. "అలాగే, మీరు మనసు సర్దుకోండి. రెండు రోజులాగే వద్దురుగానీ... మీ ఖర్చులకు డబ్బుందికదా ?" శేషగిరి కారు దిగి తలూపాడు....కారు, లారీ, ఒకదానివెంట ఒకటివెళ్ళిపోయాయి. ఏదో దొరికిన బస్సులో ఎక్కి, తిరిగీ గుంటూరుకు చేరాడు శేషగిరి.... లాడ్జిలో సామానువేసి, పక్కమీద పడుకున్నాడేగానీ నిద్ర రాలేదు.... టైం రాత్రి తొమ్మిది కావొస్తోంది.

ఇప్పుడు తనేం చెయ్యాలి ? రామారావులా సర్దుకు పోవాలా ! ఉద్యోగం వదులుకోవాలా ? ఉద్యోగం పోతే తన గతేమిటి ?

మెల్లిగా తలుపుమీద ఎవరో తడుతున్న చప్పుడు "బాబుగారూ !" అన్న మెల్లని పిలుపు వినిపించి ఉలిక్కిపడ్డాడు శేషగిరి.... కుతూహలంగా తలుపు తీశాడు.

కాకీ నిక్కరు, చొక్కాతో, టాక్సీ డ్రైవర్‌లా కనిపిస్తున్న ఒక తను నిల్చుని వున్నాడు....

"తమరికి....రిక్షా కట్టించమన్నారా బాబూ ?" అన్నాడు అదో రకంగా నవ్వి....

"ఎందుకూ ?" శేషగిరి ఆశ్చర్యంగా చూశాడు; తను పిలవలేదే ! .

.... అతగాడు చేతులు నులుపుకుంటూ వినయంగా నవ్వాడు "రిక్షాగానీ ...టాక్సీగానీ ...మీ రేది కోరితే అదే తెస్తా .. జలసాగ గడపొచ్చు...." సగం సగం చెప్పాడు....శేషగిరిలో ఏదో కుతూహలం రేగింది. తనలో చెలరేగివున్న ఆలోచనల బరువునుంచి రిలీఫ్ పొందాలంటే, ఏదో ఓ విధంగా కాలాన్ని నెట్టాలి ...సినిమాకు వెళ్ళే వుత్సాహం

లేదు. కమలను రేపు ఉదయంగానీ చూడటానికి వీలులేదు .... ఈలోగా ఎవరితోనో ఒకరితో ఏదో ఓ బాతాఖానీ చేస్తే బావుండు ననిపిస్తోంది.

"నువ్వు చెప్పేదేమిటో సరిగా అర్థం కాలేదు నాకు .... ఇలా లోపలకువచ్చి కూర్చుని సరిగాచెప్పు" అన్నాడు అతగాడివేపు చూస్తూ.

అతగాడు లోపలికి వచ్చి, నేలమీద కూర్చున్నాడు ....

"మీరు ఏ టైప్ ఆడవాళ్లు కావాలంటే ఆ టైప్‌వాళ్ళ దగ్గరకు తీసుకెడతాం బాబూ! గుట్టుగా, ఇటు మీకుగాని, అటు వాళ్ళకుగానీ పరువు దెబ్బలేకుండా జరుపుతాం! కాస్త తక్కువరేటు అయితే, పదిహేను రూపాయలు ఇవ్వాలి మీరు, మాకు ఐదూ, ఆవిడకు పదివస్తాయి.

"ఫామిలీ టైప్ ఆడవాళ్ళు కొందరు .... డబ్బు ఇబ్బందులవల్ల .... చాటుమాటుగా ఇలా. . .వాళ్ళకు ముఫైరూపాయిలు ఇవ్వాలి....మాకు పది ఇస్తారు....ఇరవై మిగులుతాయి వాళ్ళకు....

"ఇక ఫస్టుక్లాస్ అనుభవం కోరాలో....! డబ్బు ఎక్కువే అనుకోండి....టాక్సీ తెస్తాను....పాపం! కొందరు కాలేజీ అమ్మాయిలు.... చదువు సాగకా....చదువు మానుకోలేకా, మరి కొందరు విలాసానికీ కూడా అనుకోండి....ఎక్కువ భాగం డబ్బు ఇబ్బందుల వల్లే....ఇలాటి మార్గం చూచుకుంటున్నారు. ఫామిలీ ప్లానింగ్ పద్ధతుల పుణ్యమా అని...అటు వాళ్ళకు గానీ, ఇటు మీబోటి వాళ్ళకు గానీ ఏలాటి భయమూ లేదుగా మరి....అయితే, రేటు చాలా ఎక్కువ....అరవై రూపాయల పైమాటే గానీ, అంతకు తగ్గదు....మాకు ఇరవై ఇస్తారు....మరి మీకేది కావాలో చెబితే...."

ఇదంతా కొత్తగా వింతగా వుంది శేషగిరికి....ఆఫామిలీ టైప్ స్త్రీలను గానీ.... కాలేజీ అమ్మాయిలనుగానీ చూస్తే.... ఇదేం బుద్ధని అడిగితే!

"మీకూ లోకంపోకడ తెలిసిందిగా? కడుపునిండా తిండీ, వంటి నిండా నిద్ర, కోరుకోవటం తప్పా? అది సరైన మార్గాలలో లభ్యం కాకపోతే, ఈ వంకరదారి పట్టక తప్పుతుందా? అది తప్పా? ఆకలి తీరనప్పుడు మనిషీ-పశువూ ఒకటౌతారని తెలియదూ? కడుపు నిండాక కూడా పశువుల్లా ప్రవర్తించే వారికంటే మేం నయంకాదూ?" అని దులిపేస్తారేమో!

ఏది ఏమైనా ఒక్కర్ని కలుసుకోవాలి.... ఆమె ఏ పరిస్థితుల్లో ఇలా ప్రవర్తిస్తోందో తెలుసుకోవాలి....తన చేతిలో ప్రస్తుతం వంద రూపాయిలున్నాయి. ఇవి చివరి వందేమో? లేక తను తిరిగి అదే ఉద్యోగం చేస్తాడో లేదో? తనకే తెలియదు.

ఏదో వెర్రి ఆవేశం శేషగిరిలో కట్టలు తెంచుకుంది.

"టాక్సీ తెమ్మంటారా?" శేషగిరిలో చెలరేగుతున్న భావాల్ని పసిగడుతున్నట్లు, టెంప్ట్ చేస్తున్నట్లున్న గొంతుకతో అడిగాడు అతగాడు.

"టాక్సీ తీసుకురా...చక్కటి. . . మంచి . . . శేషగిరి మాట పూర్తికాకముందే అతగాడు నవ్వాడు. .

"అదంతా మీకెందుకు. . . నే తీసికెడతాగా, పాపం! ఓ చక్కటి మంచి అమ్మాయి. . . మొన్ననే చెప్పింది. . . నాతో! ఇంకా కొత్త . . . అనుభవం లేదు. భయం. అయినా చదువుకోవాలని. . . ఇష్టం లేని పెళ్ళి తప్పించుక . . . చదువుకుని . . . బాగుపడాలని ఆశ అట .... మిమ్మల్ని అక్కడికి తీసికెడతాను....పది నిమిషాల్లో టాక్సీ తెస్తాను...ఈలోగా మీరు డ్రెస్ చేసుకొని వుండండి." అతగాడు వెళ్ళిపోయాడు...పది నిముషాల తర్వాత టాక్సీ కదిలింది.

సందులు గొందులు తిరిగి ఓ డాబా ఇంటిముందు ఆగింది టాక్సీ.

"ఇలాటి ఇళ్ళ మీదికి పోలీసులూ, కేసులూ గొడవలూ వుండవు..." నవ్వుతూ అని. 'మీరిక్కడే వుండండి ఆమెగారికి చెప్పి వస్తాను. . ."

అతడు లోపలకు వెళ్ళి, మూడు నిమిషాల్లో తిరిగి వచ్చాడు. డబ్బు కాటోలు జేబులో పెట్టుకున్నాడు.

"ఇక మీరు వెళ్ళండి. మూడు గంటల తర్వాత రెండో ఆట వది లాక....ఓ అరగంట అటూ, ఇటూగా టాక్సీ తెస్తాను. మీ లాడ్జి దగ్గర మిమ్మల్ని దింపుతాను. . .రానేమోనని కంగారు పడకండి. . . నమ్మకం చెడగొట్టుకుంటే, మే మెందుకు పనికొస్తాం ? ఆ అమ్మాయిగారిని కూడా ఆమె హాస్టల్ దగ్గర విడిచి పెట్టాలి. . ." అతగాడు టాక్సీ తీసుక వెళ్ళి పోయాడు. ముచ్చటగా వున్న చిన్న డాబా ఇల్లు. . .ఏదో కొత్తబాధ.కొత్త ఆవేశం. వుక్కిరి బిక్కిరి చేస్తున్నాయి శేషగిరిని . .మెల్లగా వరండా లోకి వచ్చాడు. చీకటిగా వుంది. లోపలి గదిలోని లైటు వెలుతురు, కిటికి లోనుంచి, వరండా ఓ మూలగా పడుతోంది.

పాపం ! ఆ అమ్మాయి ఆర్థిక యిబ్బందులను అవకాశంగా తీసు కుంటున్నాడా తను ? లేదు లేదు తను గాకుంటే మరొకడు ! అసలు ఇది మంచిది గాదని నచ్చచెప్పగలిగితే ?

లేక ఆ అమ్మాయి విలాసంకోసం ఈ మార్గం తొక్కినదైతే? క్షమార్హు రాలుకాదు. . .తన క్షమ ఏమిటి? తనక్షమతో ఆమెకు పనేమిటి? ఆమె పరిస్థితులు ఆమెని తరుముతుంటే, ఆమె ఎంత కుమిలిపోతుందో? క్షమించటానికీ, మానటానికీ తనెవరు ?

శేషగిరి ఆలోచల్ని చెదరకొడుతూ సన్నని కోమలకంఠస్వరం, కొద్దిగా తెరుచుకుని వున్న తలుపు చాటునుంచి వినిపించింది.

" లోనికిరాండి. . ."

మాటలలో స్పష్టంచేయలేని ఏదో భావావేశం ముంచెత్తగా, లోపల అడుగు పెట్టాడు శేషగిరి .... తలెత్తి ఆ అమ్మాయి వేపు చూశాడు. అంతే!

అతగాడి రక్తం గడ్డకట్టినట్టయ్యింది....కళ్లు బైర్లుకమ్మసాగాయి.... కాళ్ళక్రింద నేల కదల సాగింది....

"కమల!" అంటూన్న అతగాడి పెదవులు బిగుసుకు పోయాయి....

"అన్నయ్య!" అన్న ధ్వని వినిపించలేదు అతగాడి చెవుల్లో రేగిన హోరులో!

("ప్రగతి" 19–9–'69)